




నేలపట్టు పక్షుల పురిటిల్లు



నేలపట్టు రారాజు

పెలికాన్



నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రంలో భారీకాయంగల పక్షి పెలికాన్. దాదాపు 15 కిలోల దాకా బరువుంటుంది. దీనిని గూడ బాతు, గూడకొంగ అని స్థానికంగా అంటారు. నేలపట్టులో గ్రే పెలికాన్స్ (ముదుర బూడిద రంగు) పక్షులు ఎక్కువగా విడిది చేస్తాయి. 4 అడుగుల పొడవుతో ఉండే పెలికాన్ రెక్కలు 6 నుండి 7 అడుగుల నిడివి కలిగి ఉంటాయి. మెడ కింద భాగంలో 4 అడుగుల సంచి లాంటిది ఉంటుంది. ఉదయాన్నే లేచి పులికాట్ సరస్సులో వేటకు వెళ్తుంది. 5 కిలోల దాకా బరువుండే చేపలు, పీతలు, కప్పలు వేటాడి మెడకింది సంచిలో వేసుకుని సాయంత్రానికి గూటికి చేరుతుంది. నేలపట్టు చెరువులోని కడప చెట్లమీద గూడు కట్టుకుని రెండు,మూడు గుడ్లు పెడుతుంది. ఆడపక్షి గూటిలో ఉంటే మగపక్షి వేటకు వెళ్తుంది. 30 రోజులపాటు పొదుగుతుంది. పిగిలిన పిల్లల్ని 12 నెలల పాటు పెంచి, రెక్కలొచ్చాక వాటితో కలిసి మరో ప్రాంతానికి వలసపోతుంది. అక్టోబరు చివరలో పెలికాన్‌ల రాకడ మొదలవుతుంది. శ్రీలంక, బర్మా, ఆస్ట్రేలియాల నుంచీ, హిమాలయ ప్రాంతాల నుంచీ పెలికాన్‌లు ప్రతి ఏటా నేలపట్టుకు వలస వస్తాయి. పెలికాన్ జీవిత కాలం పదేళ్లు.

ఇప్పటికే చేరుకున్న పెలికాన్‌ల సంఖ్య: 1316
గత ఏడాది వచ్చినవి: 1014

వెదురుపట్టు స్నేహితులు

ఎర్రకాళ్ల కొంగలు





నేలపట్టుకు సమీపంలోని వెదురుపట్టు నర్సమాంబపుర అగ్రహారంలో ఈ అరుదైన ఎర్రకాళ్ల కొంగలు (పెయింటెడ్ స్టార్క్స్) విడిది చేస్తాయి. హిమాలయాల్లోనూ, దక్షిణాసియాలోనూ కనిపించే ఈ పక్షులు డిసెంబరులో ఇక్కడికి చేరుకుంటాయి. ఇళ్ల మధ్య ఉండే చింతచెట్ల మీదే వీటి ఆవాసం. పగలంతా పులికాట్ సరస్సులోని శ్రీహరికోట, కొండూరు పాళెం, రాయదొరవు, ఇరకం, పేర్నాడు ప్రాంతాల్లో వేట సాగించి, సాయంత్రానికి వెదురుపట్టుకు చేరుకుంటాయి. చేపలను, పీతలు, రొయ్యలు ఆహారంగా తీసుకుంటాయి. వీటి విసర్జితంతో చెట్లకింద దిబ్బలు పేరుకుంటాయి. ఇది పొలాలకు ఎరువుగా వాడుకుంటారు. స్థానిక ప్రజలతో ఎంతో స్నేహంగా సన్నిహితంగా మెలుగుతాయి. వెదురుపట్టు ప్రజలు వీటి రక్షకులుగా ఉంటారు. ఫిబ్రవరి నుంచి గుడ్లు పొదిగి సంతానోత్పత్తి చేస్తాయి. మే నెలదాకా పిల్లల్ని పెంచి, వెంటతీసుకుని వెళ్లిపోతాయి.

తొలి అతిథి

నత్తగుల్ల కొంగ

విదేశీ విహంగాల్లో మొదటిగా వచ్చే పక్షి ఓపన్ బిల్ స్టార్క్స్. దీనిని నత్తగుల్లకొంగ అంటారు గోధుమ రంగులో నిగ నిగలాడుతూ ఉండే ఈ పక్షి, సంతానోత్పత్తి తరువాత తెలుపు రంగులోకి మారడం విశేషం. రెండు నుండి మూడు గుడ్లు పెట్టి పొదుగు తుంది. నేలపట్టులోనే సంతానోత్పత్తి చేస్తుంది. ఇవి రైతు నేస్తాలు కూడా. వరి పొలాల్లో సంచరించి చీడపీడలను తినేస్తాయి. దాంతో తెగుళ్ళ బెడద తగ్గుతుంది.

ఇప్పటికే చేరుకున్న సంఖ్య : 1964
గత ఏడాది వచ్చినవి : 3116



గుంపులుగా పొదిగే పక్షి

తెల్లకంకణాయి



దక్షిణ అమెరికా, వెస్టిండీస్ దేశాల నుంచి అక్టోబరు నెలాఖరు రోజుల్లో నేలపట్టుకు చేరుకున్న పక్షి తెల్లకంకణాయి (వైట్ ఐబీస్). ఏప్రిల్ మొదటి వారం వరకు ఇక్కడే ఉంటాయి. చెరువులోని చెట్ల మీద గుంపులుగా పొదుగుతాయి. ఒక పక్షి రెండు నుంచి ఐదు గుడ్లు పెడుతుంది. చేపలు, కప్పలు, కీటకాలను ఆహారంగా స్వీకరిస్తుంది.

ఇప్పటికే చేరుకున్న సంఖ్య: 2458
గత ఏడాది వచ్చినవి : 1274

ప్రత్యేక కథనం

ప్రత్యేక కథనం దొరవారిసత్రం, ఆంధ్రజ్యోతి

పెళ్లయ్యాక మెట్టినింటికి వెళ్లిపోయిన ఆడపిల్లలు, పురిటి కోసం మాత్రం పుట్టింటికి చేరుకోవడం ఆనవాయితీ. పక్షులు కూడా ఈ ఆనవాయితీని పాటిస్తాయని తిరుపతి జిల్లా దొరవారిసత్రం మండలంలోని నేలపట్టు నిరూపిస్తోంది. సైబీరియా, దక్షిణ అమెరికా, ఆస్ట్రేలియా, శ్రీలంక, బర్మా, ఇంగ్లండ్, హిమాలయాలు.. దూరాలతో పనిలేదు. జీపీఎస్‌తో పనిలేదు. రెక్కల కష్టమనే వెరపు ఉండదు. ఎగురుకుంటూ ఎగురుకుంటూ నవంబరు నెలకల్లా నేలపట్టుకు చేరుకుంటాయి. పుల్లాపుచికా, గడ్డీగాదం ఏరుకొచ్చి గూళ్లు కట్టుకుంటాయి. గుడ్లు పెట్టి పొదుగుతాయి. పులికాట్ సరస్సులోనూ, పరిసరాల్లోని చెరువులూ, నీటి చెలమలూ, వరికయ్యల్లోనూ నత్తలూ, ఎండ్రకాయలూ, కప్పలూ, చేపలూ, రొయ్యలూ వేటాడి తెచ్చి పిల్లలకు గోరుముద్దలు చేసి తినిపిస్తాయి. రెక్కలు అమిరి ఎగరగలవని నమ్మకం కుదిరాక తిరుగు ప్రయాణం మొదలు పెడతాయి. ఫిబ్రవరి నుంచి మే నెల దాకా వెనక్కి వలస సాగుతుంది. మళ్లీ వేల కిలోమీటర్లు ఎగిరి వెళ్లిపోతాయి. ఇక్కడ పుట్టిన పిల్లలు ఎక్కడెక్కడో పెరిగి పెద్దయినా, పుట్టింటిని గుర్తు పెట్టుకుని మళ్లీ ఏడాదికంతా నేలపట్టును వెతుక్కుంటూ వస్తాయి. ఏటా దాదాపు 8నుంచి 9 వేల పక్షులు నేలపట్టు విడిదికి చేరుకుంటాయి. గత ఏడాది 8286 పక్షులు రాగా, ఈ ఏడాది ఇప్పటికే 7813 పక్షులు నేలపట్టులో రెక్కలు రెపరెపలాడిస్తున్నాయి. తెల్లని పక్షులు వాలిన పచ్చని చెట్లతో కూడిన నేలపట్టు అందాలను ఆస్వాదించడానికి పర్యాటకులు ఈ సీజన్‌లో పెద్ద సంఖ్యలోనే వస్తున్నారు.

శ్రీలంక నుంచి వచ్చే

చిన్న నీటి కాకులు

నేలపట్టులో చాలా పెద్ద శ్రీలంక నుండి వచ్చే పక్షి లిటిల్ కార్మోరెంట్స్. శరీరం నల్లగా, ఈకలు గోధుమ రంగులో ఉంటాయి. ఒంటరిగా నీటిలో మునుగుతూ ఆహార అన్వేషణ చేస్తుంది. ఒక మీటర్ లోతున్న నీటిలో మాత్రమే ఆహార అన్వేషణ చేస్తుంది. నవంబరు నుండి ఫిబ్రవరి వరకు ఈ జాతి పక్షులు ఇక్కడ సంచరిస్తాయి. ఇక్కడే గుడ్లు పెట్టి పొదిగి పిల్లలతో కలిసి వెళ్లిపోతాయి.

ఇప్పటికే చేరుకున్న సంఖ్య : 41
గత ఏడాది వచ్చినవి : 301



రాత్రి వేటగాడు

శబరి కొంగ



గ్రీకు జాతికి చెందిన నైట్ హెరాన్స్ ను నేలపట్టులో శబరికొంగ అని పిలుస్తారు. పొట్టి మెడ, పొట్టి కాళ్ళు బూడిద రంగు శరీరం పైన నలుపు కిరీటం గల పక్షి ఇది. రాత్రి వేళ్ళలో వేట సాగిస్తుంది. చిన్న చేపలు, కప్పలు, జలకీటకాలను తింటుంది. పగటి పూట చెట్లు, పొదల్లో విశ్రాంతి తీసుకొంటుంది. 3 నుండి 8 గుడ్లు పెడుతుంది. ఆగ్నేయ ఐరోపా నుంచి ఎగిరి వచ్చి, గుడ్లు పెట్టి, .పొదిగి పిల్లలతో వెళ్లిపోతుంది.

ఇప్పటికే చేరుకున్న సంఖ్య : 68
గత ఏడాది వచ్చినవి : 593

ఇంగ్లండ్ మిత్రులు

చిన్నస్వాతికొంగలు



ఆసియా, ఆఫ్రికా, ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ దేశాల్లో ఎక్కువగా నివశించే చిన్నస్వాతికొంగలు (లిటిల్ ఎగ్రేట్స్) నేలపట్టులో అరుదుగా మాత్రమే తారసపడుతుంటాయి. 1994 నుండి మాత్రమే ఇవి నేలపట్టుకు వస్తున్నాయి. లోతు లేని నీళ్ళల్లో ఆహారం సేకరణ చేస్తుంది. చిన్న జీవులను తింటుంది. 3 - 5 వాటి గుడ్లు నీలం, ఆకుపచ్చ రంగులో ఉంటాయి. 3 నుంచి 5 గుడ్లను ఒక పక్షి పెడుతుంది. మూడు వారాలు పాటు పొదిగి, ఆరు వారాల పాటు పిల్లను పెంచి వాటితో కలిసి ఎగిరి వెళ్ళిపోతుంది.

ఇప్పటికే చేరుకున్న సంఖ్య: 1686, గత ఏడాది వచ్చినవి: 1562

నేలపట్టు విడిదికి చేరుకున్న మరికొన్ని పక్షులు...

లార్జ్ ఎగ్రేట్స్(పెద్దస్వాతి కొంగలు) 10, పాండ్ హెరాన్స్(గుడ్డి కొంగలు) 35, .క్యాటిల్ ఎగ్రేట్స్ (పశువుల కొంగలు) 68, ఇండియన్ మోర్ హెరాన్స్(జమ్ముకోళ్ళు) 14, స్పాట్ బిల్ డక్స్ (చుక్కమూతి బాతులు) 10, డాబ్ చిక్స్ (బుడగ బాతులు) 13, కూట్స్(చుక్కకోళ్ళు)12, ఫర్పల్ మోరోహెన్స్(చెంచుకోడి)6, విజిలింగ్ డక్స్(ఈల వేసే చిలువలు) 30 ఉన్నాయి.

అరుదైన గెస్ట్

తెడ్డుముక్కు కొంగ



నేలపట్టుకు అరుదైన వలస పక్షి ఇది. నలుపు, పసుపు రంగుల కలిగిన గరిటిలాంటి(స్పూన్ ఆకారంలో) ముక్కు ఉంటుంది. సంతానోత్పత్తి కోసమే నేలపట్టుకు వస్తుంది. రెండు గుడ్లు పెడుతుంది. మంచి నీరు, పులికాట్‌తో పాటు, చెక్ డ్యామ్‌లు, చిత్తడి పొలాల్లో వేట సాగిస్తుంది. చేపలు, రొయ్యలు ఎక్కువగా స్వీకరిస్తుంది. తక్కువ లోతుండే పులికాట్‌లో వీటికి అనువైన ఆహారం లభిస్తుడంతోనే ఇక్కడికి ఏటా పెద్ద సంఖ్యలో వస్తున్నాయి.

ఇప్పటికే చేరుకున్న సంఖ్య: 82 , గత ఏడాది వచ్చినవి : 26



తిరుపతి వైసీపీలో టీడీఆర్ టెర్రర్

- తుడా అధికారులతో కలసి విజిలెన్సు క్షేత్రస్థాయి తనిఖీలు
- నాలుగు మాస్టర్ ప్లాన్ రోడ్లలో ముగిసిన పరిశీలన
- వెలుగుచూడనున్న కోట్లాది రూపాయల అవినీతి



విజిలెన్సు అధికారులు తనిఖీ చేస్తున్న కొంకా చెన్నాయి గుంట రోడ్డు

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 23(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో తిమ్మిని బమ్మిని చేసి టీడీఆర్ బాండ్ల కుంభకోణానికి పాల్పడిన సూత్రధారులు, పాత్రధారుల గుట్టు బయటకు రానుంది.దీంతో తిరుపతి వైసీపీ నేతల్లో ఆందోళన మొదలైంది. తిరుపతి నగర పాలక సంస్థలో టీడీఆర్ (ట్రాన్స్‌ఫరబుల్ డెవలప్మెంట్ రైట్స్) బాండ్ల కుంభకోణం డొంక వేగంగా కదులుతోంది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అధికారాన్ని చేతిలోకి తీసుకుని తిరుపతిలో అడ్డగోలుగా ఏర్పాటు చేసిన 21 కొత్త, ఏడు పాత మాస్టర్ ప్లాన్ రోడ్లలో జరిగిన రూ.కోట్లాది అవినీతిపై నిగ్గు తేల్చడానికి జిల్లా విజిలెన్సు విభాగం రంగంలోకి దిగింది. తుడా అధికారులతో కలసి క్షేత్రస్థాయి విచారణ మొదలుపెట్టింది. మాస్టర్ ప్లాన్ రోడ్లకు సంబంధించి ఇప్పటివరకు దాదాపు 400కు పైగా టీడీఆర్ బాండ్లు జారీ చేశారు.ఈ నేపథ్యంలో రూ.4వేల కోట్ల కుంభకోణం జరిగిందని టీడీపీ నేత ఆనం వెంకటరమణారెడ్డి గతంలో ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దీనిపై విజిలెన్సు డీజీపీ విచారణకు ఆదేశించారు. గత 10 రోజులుగా జిల్లా విజిలెన్సు ఎస్పీ కరీముల్లా షరీఫ్ ఆధ్వర్యంలో ఇన్‌స్పెక్టర్లు, తుడా ఇంజనీరింగ్, సర్వే అధికారులు, విజిలెన్సు సిబ్బంది క్షేత్ర స్థాయిలో రంగంలోకి దిగి విచారణ సాగిస్తున్నారు. ఇప్పటికి నాలుగు రోడ్లలో తనిఖీలు ముగియగా.. పెద్దఎత్తున అవినీతి అక్రమాలు చోటు చేసుకున్నట్లు వెలుగులోకి వస్తోంది. ఒక్కో రోడ్డులో కనీసం రూ.రెండు కోట్ల నుంచి రూ.మూడు కోట్ల వరకు సగటున అవినీతి చోటు చేసుకుని ప్రజా ధనం విచ్చలవిడిగా మట్టిపాలు చేశారని విచారణలో తేలింది. పెద్దఎత్తున కోట్లాది రూపాయలు అవినీతి జరిగి ఉంటుందని విజిలెన్సు అధికారులు అంచనా వేస్తున్నారు. టీడీఆర్ బాండ్ల కుంభకోణంపై పూర్తిస్థాయిలో నిగ్గు తేల్చి త్వరలోనే ప్రభుత్వానికి సమగ్ర నివేదిక అందచేస్తామని విజిలెన్సు ఎస్పీ కరీముల్లా షరీఫ్ చెప్పారు.

అవినీతి జరిగిందిలా..

వైసీపీ ప్రభుత్వ హయాంలో తిరుపతిలో చేపట్టిన చేసిన 21 కొత్త. ఏడు పాత మాస్టర్ ప్లాన్ రోడ్ల పనులు ప్రణాళికా బద్ధంగా, రోడ్డు డెవలప్మెంటు ప్లాన్ ఆమోదం మేరకు జరగలేదన్న విమర్శలు ఉన్నాయి. ఒక్కోచోట ఒక్కో విధంగా, స్వార్థ ప్రయోజనాల కోసం కొందరు ప్రజా ప్రతినిధులు, కార్పొరేషన్ పట్టణ ప్రణాళికా విభాగం అధికారులు కూడ బలుక్కుని రూ.కోట్లలో దోచేశారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇందులో ప్రధానంగా ఇప్పటి వరకు విచారణ చేసిన నాలుగు మాస్టర్ ప్లాన్ రోడ్లు అడ్డగోలుగా ఏర్పాటు చేసుకున్నట్లు తేలిందని విచారణ అధికారులు భావిస్తున్నారు. ముఖ్యంగా మాస్టర్ ప్లాన్ రోడ్ల ఏర్పాటులో తిరుపతి అర్బన్ సబ్ రిజిస్ట్రార్ వద్ద ఉన్న మార్కెట్ ధర కంటే ఎక్కువగా భూమి విలువ పెంచి, తదనుకుణంగా టీడీఆర్ బాండ్లు జారీచేసినట్లు తెలుస్తోంది. అలాగే ఖాళీ స్థలానికి కూడా మార్కెట్ ధర కంటే ఎక్కువగా వాణిజ్య భూములను చూపించి మార్కెట్ విలువ కంటే పది రెట్లు ఎక్కువ ధరకు టీడీఆర్ బాండ్లు పంపిణీ చేశారు. టీడీఆర్ బాండ్లలో సూచించిన కొలతలకు క్షేత్ర స్థాయిలో ఉన్న కొలతల మధ్య రోడ్డు వెడల్పు, పొడవులో చాలా తేడాలున్నట్లు విజిలెన్సు అధికారులు గుర్తించారు. ప్రతి రోడ్డు వెడల్పు, పొడవు కొలిచి ప్రతిపాదనల్లో సూచించిన కొలతలు, రోడ్లు వేసిన కొలతలు పరిశీలించి నివేదికను విజిలెన్సు ఎస్పీకి సమర్పిస్తున్నారు. ఇందులో ఇద్దరు మాజీ ప్రజా ప్రతినిధులు, టౌన్ ప్లానింగ్ అధికారుల పాత్ర ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. మరో నెల రోజుల వ్యవధిలో మొత్తం రోడ్లు తనిఖీ చేసి అవినీతి అక్రమాలపై సమగ్ర నివేదిక అందచేయనున్నారు.

తనిఖీలు పూర్తి చేసిన రోడ్లు ఇవీ

- అక్కారంపల్లి 40 అడుగుల రోడ్డు అరకిలోమీటరు వరకు కొత్తగా ఏర్పాటు చేశారు. దీనికోసం 25 టీడీఆర్ బాండ్లు విడుదల చేశారు.
- 1.2 కిలోమీటర్ల పొడవుతో రోడ్డు డెవలప్మెంటు కింద రేణిగుంట రోడ్డు అయిల్ మిల్లు నుంచి స్టేడియం వరకు ఏర్పాటు చేసిన మాస్టర్ ప్లాన్ రోడ్డు కోసం 62 టీడీఆర్ బాండ్లు విడుదల చేశారు.
- కొంకా చెన్నాయగుంట 100 అడుగుల రోడ్డు 1.29 కిలోమీటర్ల పొడవుతో ఏర్పాటు చేసిన ఈ రోడ్డులో 13 టీడీఆర్ బాండ్లు పంపిణీ చేశారు.
- 150 మీటర్ల పొడవుతో ఏర్పాటు చేసిన మానస సరోవర్ 40 అడుగుల రోడ్డులో రెండు బాండ్లు పంపిణీ చేశారు. ఇందులో మొత్తం 102 టీడీఆర్ బాండ్లు విడుదల చేశారు.

వేటగాళ్ల కరెంటు ఉచ్చు

- తీగలకు తగిలి గజరాజు మృతి
- దేపట్లవారిపల్లె సమీపంలో ఘటన



ఏనుగు కళేబరాన్ని పరిశీలిస్తున్న డీఎఫ్‌వో, సీసీఎఫ్



మృతి చెందిన మగ ఏనుగు

భాకరాపేట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): అడవి పందుల కోసం వేటగాళ్లు లాగిన కరెంటు తీగలకు తగిలి గజరాజు మృతి చెందింది. ఈ ఘటన చిన్నగొట్టిగల్లు మండలం భాకరాపేట పంచాయతీ దేపట్లవారిపల్లె సమీపంలోని మామిడి తోటలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. డీఎఫ్‌వో వివేక్ తెలిపిన ప్రకారం.. తిరుపతికి చెందిన శివారెడ్డి మామిడి తోటలో అడవి పందుల కోసం వేటగాళ్లు.. పక్కనే ఉన్న 11 కేవీ విద్యుత్ లైన్ నుంచి తీగలు లాగారు. కొద్ది రోజులుగా పులిచెర్ల మండలంలో తిరుగుతున్న 18 ఏనుగుల గుంపు శుక్రవారం రాత్రి చిన్నగొట్టిగల్లు మండలంలోని దిగవూరు, ఆరికలవారిపల్లె గ్రామాల పొలాల గూండా దేపట్లవారిపల్లె సమీపానికి వచ్చాయి. అదే గ్రామానికి చెందిన శంకర్ రెడ్డి టమోటా తోటను, పక్కనే ఉన్న మామిడి చెట్లను ధ్వంసం చేశాయి. దాని పక్కనే ఉన్న శివారెడ్డి మామిడి తోటలోకి వెళ్లగా.. అక్కడ అడవి పందుల కోసం అమర్చిన విద్యుత్ తీగలు ఏనుగు కాళ్లకు తగలడంతో ఆ విద్యుత్ తీగను తొండంతో లాగింది. దీంతో విద్యుదాఘాతానికి గురై అక్కడిక్కడే మృతి చెందింది. దీంతో వేటగాళ్లు ఏనుగు వద్ద విద్యుత్ తీగలను కత్తిరించుకుని వెళ్లిపోయారు. ఏనుగు తొండం వద్ద విద్యుత్ తీగ అలాగే ఉండిపోయింది. విద్యుత్ తీగ తగలడంతో ఏనుగు కాలు, తొండానికి గాయమైనట్లు డీఎఫ్‌వో తెలిపారు. సంఘటన స్థలాన్ని సీసీఎఫ్ సెల్వం, ఎఫ్ఆర్‌వో వెంకటరమణ, ట్రాన్స్‌కో ఏఈ రియాజ్ అహ్మద్ పరిశీలించారు. అనంతరం జూపార్కు వైద్యులు తోయిబా సింగ్ నేతృత్వంలో వైద్య బృందం, భాకరాపేట పశువైద్యాధికారి స్రవంతి ఆధ్వర్యంలో పోస్టుమార్టం నిర్వహించి అక్కడే ఖననం చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆ రెండు ఊర్లలో కరెంటు తీసేశారు

ఎర్రావారిపాలెం, ఆంధ్రజ్యోతి: భాకరాపేట మండలం దేపట్లలవారిపల్లె సమీపంలో శుక్రవారం రాత్రి విద్యుదాఘాతంతో ఏనుగు మృతి చెందిన నేపథ్యంలో శనివారం రాత్రి రెండు గ్రామాల్లో విద్యుత్తు సరఫరా నిలిపేశారు. శనివారం రాత్రి 10 గంటలకు శాంతినగర్ చెరువులో 10 ఏనుగులు తిష్ట వేశాయి. తమ మందలోని ఏనుగు మృతి చెందితే ఆ సమీపంలోకి గుంపుగా చేరి ఘీంకరించి సంఘీభావం తెలుపుతాయి. ఆ పరిస్థితుల్లో మనుషులు కనిపిస్తే దాడి చేసే అవకాశం ఉంటుంది. అందుకని ఫారెస్టు అధికారులు, పోలీసులు సోషల్ మీడియాలో హెచ్చరికలు జారీ చేస్తున్నారు. కొంతమంది రైతులు తమ పంటలను కాపాడుకునేందుకు విద్యుత్ తీగలు వేస్తారేమోననే ఉద్దేశ్యంతో అధికారులు ఈ రెండు గ్రామాల పరిధిలో సరఫరాను నిలిపివేయించారు. దీంతో



గ్రామస్తులు [illegible]

ఎందుకీ మౌనం..?

వైసీపీ వీరవిధేయుల్లో ఆవేదన

తిరుపతి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): తమ నాయకుడికి ఉమ్మడి చిత్తూరు జిల్లా పగ్గాలు వచ్చాయన్న ఆనందోత్సాహాలు కొద్దిరోజులకే వైసీపీ శ్రేణుల్లో ఆవిరైపోతున్నాయి.తిరుపతిలో కొందరు వైసీపీ కార్పొరేటర్లు కూటమి పార్టీల వైపు చూడడంతో ముఖ్యనాయకులు నైరాశ్యంలోకి వెళ్లిపోయారు. మున్సిపల్ ఎన్నికల చట్ట సవరణ నేపథ్యంలో వైసీపీ కార్పొరేటర్లు కూటమి పార్టీలో చేరేందుకు విజయవాడకు వెళ్లడం, జిల్లా ఇన్‌చార్జి మంత్రితో చర్చించడం వంటి పరిణామాలు వైసీపీ శ్రేణుల్లో గుబులు రేపుతున్నాయి. మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డికి కుడిభుజంగా వ్యవహరించిన దొడ్డారెడ్డి సిద్దారెడ్డితో పాటు అతడి వర్గీయులు, భూమన ఫొటోను బంగారు ఉంగరాలు, లాకెట్లో వేసుకుతిరిగిన డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ టీడీపీలో చేరేందుకు ఉత్సాహం చూపించడంతో వైసీపీ వర్గాల్లో నిస్తేజం ఆవహించింది. ఉమ్మడి జిల్లా అధ్యక్ష బాధ్యతలు స్వీకరించిన భూమన ఆయా నియోజకవర్గాల సమావేశాల్లో బిజీగా ఉంటున్నారు. ఆయన తనయుడు మాజీ డిప్యూటీ మేయర్ అభినయ్ కొన్నిరోజులుగా తిరుపతిలో కనిపించడంలేదు. అవిశ్వాసంపై ఏమి జరిగినా స్వాగతిస్తామన్నట్టుగా మేయర్ శిరీష ఉండడంతో వైసీపీ సీనియర్ కార్పొరేటర్లు ఆవేదనతో రగిలిపోతున్నారు. ఈ నేపథ్యంలో 'తిరుపతి రాజకీయం రివర్స్ అయిపోయింది. కాపాడుకోవాల్సిన వాళ్లు సైలెంట్ అయిపోయారు. కాపాడాల్సిన వారు కూడా మౌనం దాల్చారు' అంటూ భూమన ముఖ్య అనుచరుడు, కార్పొరేటర్ ఎస్కే బాబు తన ఆవేదనను శుక్రవారం సాయంత్రం ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేశారు. ఇది గమనించిన భూమన సాహితీ మిత్రుడొకరు.. 'ఏంది బాబూ ఇది?' అంటూ ఇంటిపోరును వీధిలో వేసుకుంటామా? అన్నట్టుగా అసంతృప్తితో కామెంట్ చేశారు. దీంతో కొద్దిసేపటికి ఫేస్‌బుక్ నుంచి తన పోస్టును ఎస్కే బాబు తొలగించారు. అప్పటికే రాజకీయ వర్గాల్లో ఆ పోస్ట్ వైరల్‌గా మారింది. చేజారిపోతున్న కార్పొరేటర్లను బుజ్జగించి కాపాడుకోవాల్సిన మేయర్ చేతులెత్తేయడం, తమకే బలముందని కార్పొరేటర్లతో సమావేశం ఏర్పాటుచేసి దిశానిర్దేశం చేయాల్సిన భూమన పట్టించుకోకపోవడం వైసీపీలో చర్చగా మారుతోంది.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

రేపు పుంగనూరులో జనసేన శంఖారావ యాత్ర



విలేకరులతో మాట్లాడుతున్న జనసేన నాయకులు

పుంగనూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఈనెల 25న పుంగనూరులో జనసేన నాయకుడు ఎస్. వేణుగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో శంఖారావ యాత్ర ప్రారంభించనున్నట్లు ఆ పార్టీ నాయకులు పడగాల రమణ, విరూపాక్షి తెలిపారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ 25న బాలాజీ థియేటర్ నుంచి ఎంబీటీ రోడ్డు, ఇందిరాసర్కిల్, ప్రైవేటు బస్టాండ్ మీదుగా ఎన్టీఆర్ సర్కిల్ వరకు ర్యాలీ చేసి అనంతరం జనసేన సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లా నాయ కులు పసుపులేటి హరిప్రసాద్, కిరణ్‌రాయల్, శివదత్, మహేశ్ హాజరు కానున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని జనసేన నాయకులు, కార్యకర్తలు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు శివకుమార్‌రెడ్డి, చిన్నారాయల్, చైతన్యరాయల్, నరేంద్రరెడ్డి, రాయుడు తదితరులు పాల్గొన్నారు.

మరుగుదొడ్ల వినియోగంపై మానవహారం



పలమనేరు, నవంబరు23 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం సందర్భంగా శనివారం స్థానిక గుడియాత్తం రహదారిపై ప్రభుత్వ బాలుర పాఠశాల విద్యార్థులచే మానవహారం ఏర్పాటు చేశారు. ఎంపీడీఓ ఖాదర్‌బాషా మాట్లాడుతూ బహిరంగ మలవిసర్జన వలన అనేక వ్యాధులు వస్తాయని, ప్రతిఒక్కరూ మరుగుదొడ్లను వినియోగించుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఓడీఎఫ్ పథకం ద్వారా ప్రతి ఇంటిలో మరుగుదొడ్డి నిర్మించుకోవాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఐఈసీ జిల్లా కన్సల్టెంట్ శాంతి, ఏఈ లోకనాథం, హెచ్‌ఎం షంషేర్, ఎన్‌సీసీ టీచర్ ప్రసాద్‌రెడ్డి, కోఆర్డినేటర్ సిద్దారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వరి నూర్పిడి యంత్రాల కోసం రైతుల పడిగాపులు



సోమలలో వర్షాలకు నేల వాలిన వరి పొలం

సోమల, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): వరి కోతలకు కూలీల డిమాండ్ ఉండడంతో రైతులు వరి నూర్పిడి యంత్రాల కోసం పడిగాపులు గాస్తున్నారు. ఇదే అదునుగా నూర్పిడి యంత్రాల ఏజెంట్లు రైతుల డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని ధరలు పెంచేచారు. గంటకు రూ.2800 నుంచి రూ. 3500కు పెంచారు. కూలీలు అందుబాటులో లేకపోవడంతో వరి నూర్పిడి యంత్రాల కోసం పరుగులు పెడుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలతో వరిపైర్లు నేల వాలిపోయాయి. మళ్లీ అల్పపీడన ప్రభావం ఉందంటూ సమాచారంతో రైతులు చేతికందే పంటలు దెబ్బతింటాయని ఆందోళన పడుతున్నారు.

గోకులం షెడ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో లీలామాధవి

చౌడేపల్లె, నవంబరు 23(ఆంధ్రజ్యోతి) : మినీ గోకులం షెడ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని ఎంపీడీవో లీలామాధవి పేర్కొన్నారు. శనివారం ఆమె ఎంపీడీవో కార్యాలయంలో గోకులం లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మండలానికి 50 గోకులం షెడ్లు మంజూరయ్యాయని, నాణ్యతగా, 40 రోజులలో షెడ్లు పూర్తి చేయాలన్నారు. షెడ్డులో ఒక ఫ్యాన్, లైట్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పశువైద్యాధికారులు పవన్‌కుమార్, దినేష్‌రెడ్డి, ఏపీవో చిన్నరెడ్డెమ్మ, ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

యానాదులతో డ్వాక్రా గ్రూపుల ఏర్పాటు



యానాదులతో మాట్లాడుతున్న ఏపీఎం మణి

చౌడేపల్లె,నవంబరు23: (ఆంధ్రజ్యోతి) బోయకొండ సమీపంలోని యానాదులతో డ్వాక్రా గ్రూపులు ఏర్పాటు చేసినట్లు ఏపీఎం మణి పేర్కొన్నారు. శనివారం ఆయన దిగువపల్లె పంచాయతీ దేవిరెడ్డి చెరువు సమీపంలోని యానాది కాలనీవాసులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన డ్వాక్రా గ్రూపుల వలన జరిగే లాభాలను వివరించి, వారిచే 2 డ్వాక్రా గ్రూపులను ఏర్పాటు చేయించారు. వారికి లోన్ కూడా మంజూరు చేయించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీసీ సుగుణ పాల్గొన్నారు.

ఉద్యాన పంటల పరిశీలన

బైరెడ్డిపల్లె, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాతూరునత్తంలో శనివారం రైతు సుబ్రమణ్యంకు చెందిన బంగాళాదుంప పంట, ఫారంపాండ్‌ను జిల్లా ఉద్యాన శాఖాధికారి డాక్టర్ మధుసూదన రెడ్డి పరిశీలించారు. రైతులు నీటికొరతను అధిగమించడానికి పొలంలో ఫారంపాండ్ నిర్మిస్తే ఉద్యానశాఖ ద్వారా రూ.75వేల రాయితీ అందజేస్తామన్నారు. అలాగే తీగజాతి కూరగాయలను సాగుచేసే రైతులు శాశ్వత పందిరిని ఏర్పాటు చేసుకుంటే ఒక ఎకరాకు రూ. లక్ష వరకు రాయితీ ఇస్తామన్నారు. ప్రభుత్వం అందజేస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని, రైతులు ఉద్యానశాఖ అధికారిని, రైతుసేవా కేంద్ర సిబ్బందిని సంప్రదించాలని సూచించారు.

ఎన్‌సీసీతో క్రమశిక్షణ, సేవాభావం



ర్యాలీ చేస్తున్న ఎన్‌సీసీ కేడెట్లు

పుంగనూరు రూరల్, నవంబరు23 (ఆంధ్రజ్యోతి): ఎన్‌సీసీ ద్వారా విద్యార్థుల్లో క్రమశిక్షణ పెరుగుతోందని సీఐ శ్రీనివాసులు పేర్కొన్నారు. ఎన్‌సీసీ దినోత్సవం సందర్భంగా శనివారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఎన్‌సీసీలో చేరడం వల్ల క్రమశిక్షణతో పాటు సేవాభావాలు కలుగుతాయన్నారు. అనంతరం పురవీధుల్లో విద్యార్థులతో కలసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ రాజశేఖర్, అధ్యాపకులు శ్రీనివాసులు, అనిల్‌కుమార్, సోమరాజు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి సత్యకుమార్‌ను కలసిన నానబాల



పుంగనూరు, నవంబరు23(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను పుంగనూరు బీజేపీ నాయకుడు నానబాల కుమార్ కలిశారు. శనివారం ధర్మవరంలో ఆయనతో కలసి పుంగనూరు ప్రభుత్వ ఆసుపత్రిని ఏరియా ఆసుపత్రిగా గత ప్రభుత్వం చేసినప్పటికీ డాక్టర్లు, సిబ్బందిని నియమించలేదని, ఖాళీలను భర్తీ చేయాలని కోరినట్లు తెలిపారు. మంత్రి స్పందిస్తూ త్వరలోనే ఖాళీలు భర్తీ చేయనున్నట్లు తెలిపారన్నారు.

నేడు వాలీబాల్ టోర్నమెంట్

చౌడేపల్లె, నవంబరు23(ఆంధ్రజ్యోతి): ఇషా ఫౌండేషన్ ఆధ్వర్యంలో వాలీబాల్ టోర్నమెంట్ ఈనెల 24న చౌడేపల్లె హైస్కూల్‌లో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. శనివారం వారు మాట్లాడుతూ క్రీడా పోటీలలో పాల్గొనేవారు ఉచితంగా నమోదు చేసుకోవాలన్నారు.

నేటినుంచి సహస్ర శివలింగ దర్శనం

కుప్పం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): కుప్పంలోని రామచంద్ర రోడ్డులో గల ఈశ్వరీయ విద్యాలయం సహజ రాజయోగ కేంద్రంలో ఆదివారం సాయంత్రం 6 గంటలకు సహస్ర శివలింగ దివ్య దర్శనం ప్రారంభించనున్నట్లు బ్రహ్మాకుమారీస్ తెలిపారు. ఈనెల 26 నుంచి 30వ తేదీ వరకు ఉదయం 8 నుంచి సాయంత్రం గంటల వరకు భక్తుల కోసం ఈ దివ్య దర్శన భాగ్యం కల్పిస్తామన్నారు. కుప్పం నియోజకవర్గ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

రేపు పుంగనూరులో కార్తీక దీపోత్సవం

పుంగనూరు రూరల్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం చివరి సోమవారం సందర్భంగా ఈనెల 25వ తేది పుంగనూరు కోనేరులో హిందూజాగరణ సమితి ఆధ్వర్యంలో కార్తీక దీపోత్సవం నిర్వహిస్తున్నట్లు సంఘ నాయకుడు త్రిమూర్తిరెడ్డి తెలిపారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ 25వ తేది సాయంత్రం జరిగే ఈ కార్యక్రమానికి అధిక సంఖ్యలో భక్తులు హాజరై కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకోవాలని కోరారు.

నేడు వైద్యపరీక్షలు

పుంగనూరు, నవంబరు23 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి జయంతి సందర్భంగా ఆదివారం డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం హెల్త్ ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో పుంగనూరు టిడ్కో ఇళ్ల ఆవరణలో కుప్పం పీఈఎస్ వైద్యులచే ఉచిత వైద్యపరీక్షలు జరుగుతాయని నిర్వాహకుడు ఆయూబ్‌ఖాన్ తెలిపారు. యూఎన్‌ఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఉంటుందని చెప్పారు.

ఐఎంఏ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం



పలమనేరు, నవంబరు23(ఆంధ్రజ్యోతి): ఇండియన్ మెడికల్ అసోసియేషన్ పలమనేరు బ్రాంచ్ ఆధ్వర్యంలో శనివారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రక్తదాన శిబిరం నిర్వహించారు. 56 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ పలమనేరు బ్రాంచ్ అధ్యక్షుడు డాక్టర్ యుగంధర్, ప్రధానకార్యదర్శి మల్లికార్జునరెడ్డి, కోశాధికారి అరుణ్‌కుమార్, అధ్యాపకులు చిదంబరం పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రికి బెంచీల వితరణ



పలమనేరు, నవంబరు23 (ఆంధ్రజ్యోతి) : పలమనేరు ప్రభుత్వాస్పత్రికి శనివారం స్థానిక వాసవి మహిళా మండలి, శ్రీపురం సీతారామయ్య, పారిశ్రామిక వేత్త బి. గంగిరెడ్డి ఇనుప బెంచీలను వితరణగా అందజేశారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ మమతారాణి, ఆర్ఎంఓ డాక్టర్ శారద, శ్రీపురం సీతారామయ్య, శ్రీపురం పద్మజ, సునీల్‌కుమార్, మాజీ కౌన్సిలర్ ఎల్లంపల్లి నరేంద్ర పాల్గొన్నారు.

సీఎంను కలిసిన టీడీపీ నేత



కుప్పం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): కుప్పంలో యువతకు ప్రాధాన్యమివ్వాలని టీడీపీ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి చాంద్ బాషా ముఖ్యమంత్రి చంద్రబాబును కోరారు. అమరావతిలో శనివారం ఆయన ముఖ్యమంత్రిని కలిశారు. ఈ సందర్భంగా చాంద్ బాషా మాట్లాడుతూ శాసనసభ ఎన్నికల్లో ముస్లింల ఓటు శాతం తగ్గిందన్నారు. పార్టీలో కష్టపడిన వారికి గుర్తింపు ఉంటుందని చంద్రబాబు చెప్పారన్నారు.

బేటరాయ స్వామికి ప్రత్యేక పూజలు



కుప్పం, నవంబరు23(ఆంధ్రజ్యోతి): గుడుపల్లె మండలం పొగురుపల్లె సమీపంలోని బేటరాయహళ్లి కొండమీద వెలసిన పద్మావతీ లక్ష్మీ సమేత బేటరాయ స్వామికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయమే అభిషేకాలు చేసి. విశేష పుష్పాలంకరణ చేశారు. స్వామివారికి కైంకర్యాలు చేసి అర్చనలు జరిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు.

గంగమ్మ విగ్రహ ఊరేగింపు

సోమల, నవంబరు23:సోమల పంచాయతీ చిన్న సోమల పాఠశాల వద్ద బోయకొండ గంగమ్మ ఆలయంలో విగ్రహ ప్రతిష్టాపనలో భాగంగా శనివారం అమ్మవారి విగ్రహాన్ని ఊరేగించారు. అర్చకులు రామూర్తి ఆధ్వర్యంలో గోపూజ, గంగపూజ, పంచగవ్య, అంకురార్పణ నిర్వహించారు.

బురుజుపల్లె శ్రీవారి ఆలయంలో ఉత్సవాలు

సోమల, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): నెల్లిమంద పంచాయతీ బురుజుపల్లెలోని శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో వార్షిక బ్రహోత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. ఆలయాన్ని పచ్చని తోరణాలు, విద్యుత్ దీపాలంకరణలు చేపట్టారు. ఆదివారం కలశపూజ, పుణ్యావాచకం, గణపతి హోమం, రాత్రి అన్నమాచార్య కీర్తనలు, హరికథ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సోమవారం దేవతామూర్తుల కల్యాణోత్సవం, గరుడవాహన సేవలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

నేడు రొంపిచెర్లలో కార్తీక వనభోజనాలు

రొంపిచెర్ల,నవంబరు23 (ఆంధ్రజ్యోతి) : పెద్దమల్లెల పంచాయతీ రావిళ్లవారిపల్లెలో ఆదివారం తొగటవీర క్షత్రియ సేవాసంఘంచే కార్తీక వనభోజనాలు నిర్వహిస్తున్నట్లు ఈ సంఘ నాయకుడు యుగేష్ తెలిపారు. ఉదయం 10 గంటలకు నడింపల్లెలోని చౌడేశ్వరీదేవికి పూజల నంతరం వనభోజన కార్యక్రమాలు ఉంటాయన్నారు.

ఎస్సీ వర్గీకరణపై 'సుప్రీం' తీర్పు రాజ్యాంగ విరుద్ధం

మాలమహానాడు రాష్ట్ర నాయకుడు యమలా సుదర్శనం



పలమనేరులో మాలమహానాడు నాయకుల ర్యాలీ

పలమనేరు, నవంబరు23 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఆగస్టు 1న ఇచ్చిన తీర్పు రాజ్యాంగ విరుద్ధమని మాలమహానాడు రాష్ట్రనాయకుడు యమలా సుదర్శనం పేర్కొన్నారు. శనివారం ఎస్సీవర్గీకరణపై వచ్చిన తీర్పుకు నిరసనగా పలమనేరులో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 2004లోనే హైకోర్టు ఎస్సీ వర్గీకరణ చేసే హక్కు రాష్ట్రాలకు లేదని స్పష్టంగా పేర్కొందన్నారు. పార్లమెంట్‌లో రెండింట మూడువంతుల మెజారిటీతో ఎస్సీవర్గీకరణ చేయాలని, అన్ని రాష్ట్రాలు అసెంబ్లీలో ఆమోదం చేయాలని, ఎస్సీ ఎస్టీ కమిషన్ ఆమోదం పొందాలని పేర్కొన్నప్పటికీ సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడం తగదన్నారు. ఈ తీర్పు మోడీ ప్రేరేపిత తీర్పుగా ఆయన ఆరోపించారు. ఇప్పటివరకు ఉన్న రిజర్వేషన్ల కారణంగా మాల లు లాభపడిందీలేదు, మాదిగలు నష్టపోయిందీలేదన్నారు. స్థానిక మాలమహానాడు నాయకులు జయకుమార్ అలియాస్ జేకే, గ్యాస్ భాస్కర్, ముళబాగిల్ మునిరత్నం, పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లె పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్పీ



బైరెడ్డిపల్లె పోలీసుస్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ మణికంఠ చందోలు

బైరెడ్డిపల్లె, నవంబరు23 (ఆంధ్రజ్యోతి): బైరెడ్డిపల్లె పోలీస్‌స్టేషన్‌ను శనివారం ఎస్పీ మణికంఠ చందోలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్ నిర్వహణ, సిబ్బంది పనితీరు, ముఖ్యమైన కేసుల దర్యాప్తు, విలేజ్ రోస్టర్, వివిధ క్రైమ్ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. పెండింగ్ కేసులు, వాటి స్థితిగతులు, కేసుల దర్యాప్తులో పురోగతి గురించి తెలుసుకున్నారు. ముఖ్యంగా రోడ్డుప్రమాదాల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలను సమీక్షించారు. ఎక్కువగా విజిబుల్ పోలీసింగ్ చేయాలని, నేర నివారణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మహిళా పోలీసులు ఇంటింటికీ వెళ్లి మహిళలపై జరుగుతున్న నేరాలు, సైబర్ క్రైమ్, లోన్‌యాప్ మోసాల గురించి వివరించి అవగాహన కల్పించాలన్నారు. రోడ్డుభద్రతా నియమాలపై పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు అవగాహన సదస్సులు నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఎస్పీ ప్రభాకర్, రూరల్ సీఐ మురళీమోహన్, బైరెడ్డిపల్లె ఎస్ఐ పరశురాముడు, సిబ్బంది పాల్గొన్నారు.

చెర్లోపల్లెలో లోపించిన పారిశుధ్యం



లీకేజీతో బోరు మోటర్ వద్ద నిల్వ ఉన్న నీరు, వీధుల్లో ప్రవహిస్తున్న మురుగునీరు

పుంగనూరు రూరల్, నవంబరు23(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెర్లోపల్లెలో పారిశుధ్యం లోపించి అంటువ్యాధులు ప్రబలుతున్నట్లు గ్రామస్తులు వాపోయారు. గ్రామంలో దాదాపు 100 కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. గ్రామ ప్రజల తాగునీటి అవసరాల కోసం వేసిన బోరుమోటర్ నుంచి నీరు లీక్ కావడంతో నీరు అక్కడే నిల్వ ఉండి దుర్వాసన వెదజల్లుతోంది. ఆ నీరు తిరిగి బోరుమోటర్‌లోకి ఇంకిపోవడంతో తాగునీరు కలుషితమవుతున్నట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై పలుమార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు చెప్పినా ఫలితం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే మురుగునీటి కాల్వలు లేకపోవడంతో ఇళ్లలోనుంచి వెలువడే వ్యర్థపు నీరు వీధుల్లో ప్రవహిస్తున్నట్లు తెలిపారు. మురుగునీటిలో దోమలు పెరిగి గ్రామంలో జ్వరాలు ప్రబలే అవకాశాలు ఉన్నట్లు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బోరుమోటర్‌కు మరమ్మతులు చేపట్టి మురుగునీరు వీధుల్లో ప్రవహించకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మహారాష్ట్రలో బీజేపీ గెలుపుపై సంబరాలు



పలమనేరు, పుంగనూరులలో సంబరాలు చేసుకుంటున్న బీజేపీ నాయకులు

పలమనేరు, నవంబరు23 (ఆంధ్రజ్యోతి) : మహారాష్ట్ర ఎన్నికల్లో బీజేపీ కూటమి ఘనవిజయం సాధించడం పట్ల శనివారం పలమనేరులో బీజేపీ నాయకులు సంబరాలు చేసుకొన్నారు. ఈ సందర్భంగా పలమనేరులోని జాతీయ రహదారిపై బాణసంచా కాల్చి స్వీట్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా పలమనేరు బీజేపీ కన్వీనర్ తాతయ్యానాయుడు మాట్లాడుతూ మహారాష్ట్రలో జరిగిన ఎన్నికల్లో 288 సీట్లకు గాను బీజేపీ కూటమి 228 సీట్లు సాధించి ఘనవిజయం సాధించిందన్నారు.దేశ అభివృద్ధి, సంక్షేమం బీజేపీకే సాధ్యమన్నారు. బీజేపీ నాయకులు చెంచురెడ్డి, రాజానాయుడు, శివ, పుష్పాల వెంకటేశ్వర్లు, హేమంత్, క్రిష్ణమూర్తి, ఉపేంద్ర, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పుంగనూరు : మహారాష్ట్ర ఎన్నికల్లో బీజేపీ కూటమి విజయం సాధించడంతో పుంగనూరులో బీజేపీ నాయకులు సంబరాలు చేసుకుని మిఠాయిలు పంపిణీ చేశారు. శనివారం గూడూరుపల్లె టిడ్కో ఇళ్లలో సంబరాలు చేశారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా నాయకుడు పి.అయూబ్‌ఖాన్ మాట్లాడుతూ దేశం అన్ని రంగాల్లో ముందుకు వెళ్లాలంటే బీజేపీని ప్రజలు ఆదరించాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు నరసింహులు, పెద్దమఠంబాబు, అమరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

మాతాశిశు మరణాల నివారణే లక్ష్యం



మాట్లాడుతున్న డాక్టర్ పవన్ కుమార్

చౌడేపల్లె, నవంబరు 23(ఆంధ్రజ్యోతి) : మాతాశిశు మరణాలు నివారించటమే లక్ష్యమని డాక్టర్ పవన్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం ఎంపీడీవో కార్యాలయంలో ఐసీడీఎస్, ఏఎన్ఎం, మహిళా పోలీసులు, ఆశా కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. గర్భిణులు, బాలింతలు, అంగన్‌వాడీ చిన్నారులకు పౌష్టికాహారం సక్రమంగా పంపిణీ చేయాలన్నారు. హైరిస్క్ ఉన్నవాళ్ళకు అదనపు పౌష్టికాహారం అందించాలని, తరుచూ వైద్యపరీక్షలు నిర్వహించాలన్నారు. చంటి బిడ్డలకు తల్లి పాలే మొదటి టీకా అన్నారు. గర్భిణులలో అనీమియా నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. అంటువ్యాధులు ప్రబలకుండా ముందుస్తు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో లీలామాధవి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రమాదేవి, సులోచన, ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సంరక్షణపై విద్యార్థులకు అవగాహన

బైరెడ్డిపల్లె : దేవదొడ్డి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు శనివారం ఆరోగ్యసంరక్షణపై తీర్థం పీహెచ్‌సీ వైద్య సిబ్బంది అవగాహన కల్పించారు. పోషకాహార ప్రాముఖ్యత, చేతుల శుభ్రత, సీజనల్ వ్యాధుల నివారణ గురించి వివరించారు. ఆరోగ్యవిద్యాధికారి కాంతమ్మ, ఎంఎల్‌హెచ్‌పీ బేబి, ఏఎన్ఎం వినాయకమ్మ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

బేలుపల్లెలో కార్తీక దామోదర పూజ



బైరెడ్డిపల్లె, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) :మండలంలోని బేలుపల్లెలో వున్న సత్యనారాయణ స్వామి ఆలయంలో శనివారం కార్తీక దామోదర పూజ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు మురళీకృష్ణాచార్యులు ఉసిరి చెట్టుకు ప్రత్యేక పూజలు చేసి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి రవి, సుబ్బారావు, శ్రీనివాసమూర్తి, సత్య, సుందరమూర్తి ఉభయదారులుగా వ్యవహరించారు.

కాపు సంఘం జిల్లా అధ్యక్షుడిగా కోటీశ్వర్లు



పలమనేరు, నవంబరు23(ఆంధ్రజ్యోతి) : జాతీయ కాపు సంఘం జిల్లా అధ్యక్షుడిగా పలమనేరుకు చెందిన కె.కోటీశ్వర్లు నియమితులయ్యారు. ఆ మేరకు జాతీయ కాపు సంఘం ఏపీ అధ్యక్షుడు కర్ల మురళీకృష్ణనాయుడు నియామకపు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా కోటీశ్వర్లు మాట్లాడుతూ జాతీయ కాపు సంఘం కార్యక్రమాలను అమలు చేస్తానని పేర్కొన్నారు.

కాపు సంఘం ప్రచార కమిటీ కన్వీనర్‌గా హరికుమార్



బైరెడ్డిపల్లె, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): జాతీయ కాపుసంఘం ప్రచార కమిటీ కన్వీనర్‌గా బైరెడ్డిపల్లెకు చెందిన హరికుమార్ నియమితులయ్యారు. విజయవాడలో శనివారం జరిగిన సమావేశంలో సంఘం వ్యవస్థాపకులు మురళీకృష్ణనాయుడు తనకు నియామకపత్రాన్ని అందజేసినట్లు హరికుమార్ తెలిపారు. కాపుల సమస్యల పరిష్కారానికై తన శాయశక్తులా కృషి చేస్తానని తెలిపారు.

ఎస్టీ కార్పొరేషన్ డైరెక్టర్‌కు సన్మానం



పుంగనూరు రూరల్, నవంబరు23(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎస్టీ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన బి.కృష్ణానాయక్‌ను టీడీపీ నాయకులు ఘనంగా సన్మానించారు. శనివారం పుంగనూరు మండలం పాళ్యంపల్లెలో స్వగృహంలో ఆయనను కలసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మోహన్‌రెడ్డి, వెంకటరెడ్డి, గాజుల రమణ, నరసింహులు, ఆనంద్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

సారా తరలిస్తున్న వ్యక్తి అరెస్టు



పుంగనూరు రూరల్, నవంబరు23(ఆంధ్రజ్యోతి): సారా తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి ద్విచక్రవాహనాన్ని సీజ్ చేసినట్లు ఎక్సైజ్ సీఐ సురేంద్రరెడ్డి తెలిపారు. శనివారం పుంగనూరు మండలం పూజగానిపల్లె వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా నల్లగుట్టపల్లె తాండాకు చెందిన బాలాజీనాయక్ ద్విచక్రవాహనంలో 90లీటర్ల సారా ప్యాకెట్లు తరలిస్తూ పట్టుబడినట్లు ఆయన తెలిపారు. సారాతోపాటు ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు చెప్పారు. అలాగే సారా తయారీకి అవసరమైన బెల్లం విక్రయిస్తున్న నల్లగుట్లపల్లెకు చెందిన బుడ్డన్ననాయక్, పెద్దతాండాకు చెందిన శంకర్‌నాయక్‌లను అరెస్టు చేసి తహసీల్దార్ రాము ఎదుట హాజరుపరిచినట్లు వివరించారు. దాడులో ఎక్సైజ్ ఎస్ఐలు సుబ్రహ్మణ్యం, వేణుగోపాల్‌రెడ్డి, సిబ్బంది నాగరాజు, చక్రినాయక్, దశరథ, కిషోర్, సురేంద్రబాబు, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి

రొంపిచెర్ల, నవంబరు23(ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని ఆలయాలు, మసీదులలో ధర్మకర్తలు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఎస్ఐ సుబ్బారెడ్డి కోరారు. శనివారం ఆయన కట్టకింద శివాలయం వద్ద సీసీ కెమెరాలను ఆయన పరిశీలించారు. సీసీ కెమెరాలు, లేదంటే స్మార్ట్ లాక్‌లు ఏర్పాటు చేయాలని తెలిపారు.

అదానీని అరెస్టు చేయాలి : సీపీఎం



నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

చిత్తూరు రూరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): సెకీ నుంచి రాష్ట్ర డిస్కంలు విద్యుత్ ఒప్పందాలు చేసుకునేందుకు అదానీ గ్రూప్ భారీ ముడుపులు చెల్లించిన ఆరోపణల నేపథ్యంలో రాష్ట్రంలో అదానీ గ్రూపు కంపెనీ చేసుకున్న ఒప్పందాలను వెంటనే రద్దు చేయాలని, అదానీని అరెస్టు చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక హైరోడ్డు సర్కిల్ వద్ద సీపీఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అదానీ సంస్థలకు ప్రభుత్వ భూములు, సంస్థలను ధారాదత్తం చేసిందని విమర్శించారు. వెంటనే వారికి కేటాయించిన భూములన్నింటినీ వెనక్కు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు గంగరాజు, సురేంద్రన్, గిరిధర్, మురళి, ఈశ్వరయ్య, దాసు, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

26న జరిగే ధర్నాకు తరలిరండి


మాట్లాడుతున్న వివిధ యూనియన్ నేతలు

చిత్తూరు రూరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్తంగా రైతు, కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఈ నెల 26 తేదీన కలెక్టరేట్ ఎదుట నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేసేందుకు రైతులు, ప్రజా, కార్మిక సంఘాలు తరలిరావాలని వివిధ యూనియన్ నాయకులు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక ఎస్టీయూ కార్యాలయంలో ఏఐటీయూసీ, సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ, ప్రజా సంఘాలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ గత ఎన్నికల్లో మోడీకి తగిన గుణపాఠం చెప్పినా ఆయన కార్పొరేట్ సంస్థలకే కొమ్ముకాస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు నాగరాజు, గోపీనాథ్, మంజునాథ్, రామమూర్తి, మణి, రమాదేవి, విజయ్‌కుమార్, విజయగౌరి పాల్గొన్నారు.

వైభవంగా సత్యసాయి జయంతి



చిత్తూరు కల్చరల్, నవంబరు23(ఆంధ్రజ్యోతి): నగరంలో శనివారం సత్యసాయి బాబ 99వ జయంతి ఉత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి. గిరింపేట సత్యసాయి సంస్థాన్‌లో సత్యసాయి సేవా ఆర్గనైజేషన్స్ ఆధ్వర్యంలో స్వామివారికి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిలో రెడ్‌క్రాస్ సహకారంతో 50 మంది యువకులు రక్తదానం చేశారు. గాంధీ, ఎన్టీఆర్ కూడళ్లలో సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో పేదలకు అన్నదానం చేశారు. నిరాశ్రయులకు దుప్పట్లు, వస్త్రాలు అందజేశారు. బాబా జయంతి ఉత్సవాల్లో ఊంజల్ సేవ, పల్లకి సేవలను భక్తులు నిర్వహించారు. అదే విధంగా సత్యసాయి భజనమండలి, బాలవికాస్‌ల ఆధ్వర్యంలో బాబానామ సంకీర్తనలు ఆలపించారు.

జాబ్ మేళాలో 22 మంది ఎంపిక



చిత్తూరు రూరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఉపాధి కార్యాలయంలో శనివారం రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి శాఖ, సీడప్, డీఆర్‌డీఏ సంయుక్తంగా నిర్వహించిన జాబ్ మేళాలో 22 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి గుణశేఖర్‌రెడ్డి తెలిపారు. ఈ మేళాలో 4 బహుళ జాతీయ కంపెనీలు ఇంటర్వ్యూలు నిర్వహించాయన్నారు. 41 మందికి ఇంటర్వ్యూలకు హాజరైతే అందులో 22 మంది ఎంపికయ్యారని వివరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి శాఖ, సీడప్, డీఆర్‌డీఏ అధికారులు పాల్గొన్నారు.

పూర్వ ప్రాథమిక విద్యను బలోపేతం చేద్దాం

వెదురుకుప్పం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): పూర్వ ప్రాథమిక విద్యను బలోపేతం చేద్దామని కార్వేటినగరం ఎంపీడీవో టి.చంద్రమౌళి పిలుపునిచ్చారు. శనివారం కార్వేటినగరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అంగన్వాడీలకు పూర్వ ప్రాథమిక విద్యను బలోపేతం చేయడానికి శిక్షణ కార్యక్రమం జరిగింది. సీఐ హనుమంతప్ప, ఎంఈవోలు మంచికాయల విజయకుమార్, డీపీ మనోజ్‌కుమార్, హెచ్‌ఎం కోటీశ్వరరావు, రిసోర్స్ పర్సన్లు సి.చెంగల్రాజు, ఎ.నరేష్, సి.రాబర్ట్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, సీఆర్పీలు పాల్గొన్నారు.

చెత్తదిబ్బల తొలగింపు

వెదురుకుప్పం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మండలం రాజులకండ్రిగ కాలనీలో పంచాయతీ సిబ్బంది శనివారం పారిశుధ్య చర్యలు చేపట్టారు. పేడదిబ్బలు, చెత్త దిబ్బలను తొలగించారు. అలాగే ఇందిరా కాలనీలోనూ పారిశుధ్య పనులు నిర్వహించారు. రాజులకండ్రిగ కాలనీలో పారిశుధ్యం అధ్వానంగా ఉందని స్థానికులు ఎంపీడీవో చంద్రమౌళికి ఫిర్యాదు చేయడంతో ఆయన స్పందించారు. ఆయన ఆదేశాల మేరకు సిబ్బంది పారిశుధ్య పనులు చేపట్టారు. ఎంపీడీవో చంద్రమౌళి, సీనియర్ అసిస్టెంటు కృష్ణయ్య పనులను పర్యవేక్షించారు.

వన వేణుగోపాలుడికి క్షీరాభిషేకం

వెదురుకుప్పం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): దేవరగుడిపల్లె -ఆడారెడ్డిపల్లె సమీపంలో ఉన్న వన వేణుగోపాలస్వామికి శనివారం క్షీరాభిషేకం నిర్వహించారు. ప్రధాన అర్చకులు కార్తీక్ అయ్యంగార్ అన్నప్రసాదం చేశారు. కార్య నిర్వాహకులు శివకుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

క్రీడల్లో బృందావన్ విద్యార్థి సత్తా



చిత్తూరు సెం ట్రల్, నవం బరు 23 (ఆంధ్ర జోయతి): మధ్య ప్రదేశ్ రాష్ట్రం నర్మదాపురంలో ఇటీవల జరిగిన జాతీయ స్థాయి అండర్-19 స్కూల్ గేమ్స్ బ్యాడ్మింటన్ పోటీల్లో స్థానిక బృందావన్ స్కూల్ విద్యార్థి ప్రణవ్ సాయి క్యాంస పతకం సాధించినట్లు కరస్పాండెంట్ శైలజాకుమారి, డైరెక్టర్ ప్రియతేజ తెలిపారు. కాస్యం సాధించిన విద్యార్థిని అభినందించారు.

ఎట్టకేలకు రోడ్లకు మరమ్మతులు


ఎన్టీయార్ సర్కిల్లో చేపట్టిన ప్యాచ్ వర్కులు

చిత్తూరు అర్బన్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): ఏళ్ల తరబడి గతుకుల రోడ్లతో ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులకు అధికారులు తాత్కాలిక ఉపశమనం కల్పించారు. 'ఈ రోడ్ల ప్యాచ్‌వర్కులను మరిచారా 'అంటూ ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. స్పందించిన నగరపాలక అధికారులు గాంధీ సర్కిల్, ఎన్టీయార్ సర్కిల్, ఓవర్ బ్రిడ్జి ప్రాంతాల్లో గుంతల మయమైన రోడ్లకు మరమ్మతు పనులు చేపట్టారు. ఎన్టీయార్ సర్కిల్లో కేబుల్ వైర్ల కోసం కాలువలాగా తవ్వి వదిలేసిన గుంతలను పూడ్చే పనులు చేపట్టారు. అనంతరం నగరంలోని పలు ప్రాంతాల్లో గుంతలమయమైన రోడ్లకు ప్యాచ్‌వర్కులను చేసి ప్రయాణికులకు ఇబ్బందుల్లేకుండా చేశారు.

వాణిజ్య నిబంధనలు విధిగా పాటించాలి


మాట్లాడుతున్న జీఎస్టీ అధికారి సాబ్‌జాన్

నగరి, నవంబరు23(ఆంధ్రజ్యోతి): వాణిజ్య నిబంధనలను విధిగా పాటిం చాలని సేల్స్‌ట్యాక్స్ సహాయక కమిషనర్లు వరలక్ష్మి, పౌనమ్ పేర్కొన్నారు. వర్తక, వాణిజ్య సంస్థల నిర్వాహ కులకు, సిబ్బందికి, ఎస్టీపీలకు శనివారం స్థానిక మర్చంట్స్ అసోసియేషన్ భవనంలో అవగాహనా సదస్సు నిర్వహించారు. ఇందులో జీఎస్టీ అధికారి సాబ్‌జాన్ మాట్లాడుతూ ప్రతి రూ.200ల పైన కొనుగోలుకు విధిగా బిల్లులివ్వాలన్నారు. ఆధార్ అనుసంధానం చేసుకోవాలని ఆర్‌సీఎం, 4బి1, జాబ్‌కార్డుల గురించి అవగాహన కల్పించారు. వినియోగదారులు సైతం కొనుగోలు చేసిన వస్తువులకు బిల్లులు తీసుకోవాలన్నారు. కిరాణా మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షులు రాధాకృష్ణ, ఆడిటర్లు శక్తివేల్, తంగరాజ్, ధరణి, తేజ, సాయి, మహేష్ పాల్గొన్నారు.

వరసిద్ధుడి సేవలో భద్రాచలం ఆలయ ఈవో


భద్రాచలం ఈవోకు జ్ఞాపికను అందిస్తున్న సూపరింటెండెంట్ కోదండపాణి

ఐరాల(కాణిపాకం), నవంబరు23(ఆంధ్రజ్యోతి): భద్రాచలం ఆలయ ఈవో రమాదేవి శనివారం కాణిపాక వరసిద్ధుడిని దర్శించుకున్నారు. ఆమెను సూపరింటెండెంట్ కోదండపాణి ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామివారి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. దర్శనం అనంతరం ఆమెను వేదాశీర్వాద మండపంలో వేదమంత్రాలతో ఆశీర్వదించి స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపికను అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ చిట్టిబాబు పాల్గొన్నారు.

గౌరవంగా మెలగాలి

బంగారుపాళ్యం, నవంబరు23 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో బాలికల పట్ల విద్యార్థులు గౌరవంగా మెలగాలని సీఐ కత్తి శ్రీనివాసులు సూచించారు. శనివారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గుడ్ టచ్-బ్యాడ్ టచ్‌పై, సైబర్ నేరాలపై, రోడ్డు నిబంధనలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. హెచ్‌ఎం జనార్థన్‌రెడ్డి, ఏఎస్ఐ వళ్లెమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైభవంగా కాలభైరవ మహారక్షక యాగం

నగరి, నవంబరు23(ఆంధ్రజ్యోతి):నగరి మున్సిపాలిటీ పరిధిలోని కాలభైరవస్వామి ఆలయంలో మహాకాల రక్షకయాగం శనివారం వైభవంగా నిర్వహించారు. ప్రతి నెలా అష్టమి నాడు జరిగే పూజాకార్యక్రమంలో భాగంగా ఏడాదికోసారి కార్తీకమాసంలో జరిగే కార్తీక కాలాష్టమి సందర్భంగా మహాకాలరక్షకయాగం జరిగింది. మూలమూర్తికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు.

సత్యసాయికి ప్రత్యేక పూజలు

నగరి, నవంబరు23(ఆంధ్రజ్యోతి): నగరిలోని బేరివీధిలో గల వికలాంగుల పాఠశాలలో సత్యసాయిబాబా జయంతి నిర్వహించారు. ఆయనకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వికలాంగులకు న్యాయవాది మురళీమోహన్, రమణ, లీలావతి, సావిత్రమ్మ, భాస్కర్ అన్నదానం చేశారు.

బీజేపీ సంబరాలు

చిత్తూరు సెంట్రల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్రలో ఎన్‌డీఏ విజయంపై స్థానిక బీజేపీ శ్రేణులు శనివారం నగరంలో సంబరాలు చేసుకున్నాయి. బీజేపీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జగదీశ్వర్‌నాయుడు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. కాగా బీజేపీ సీనియర్ నాయకులు చిట్టిబాబు హర్షం వ్యక్తం చేశారు.

ఎస్సీ వర్గీకరణ ఆపాలి



బంగారుపాళ్యం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణను ఆపేయాలని మండలం అంబేద్కర్ యువజన సంఘం నాయకులు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా నిరసన తెలిపారు. మాల, మాదిగలు అన్నదమ్ముల్లా ఉంటున్నామని, ఓట్ల కోసం ఎస్సీలను విభజించేందుకు కుట్రలు పన్నుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో దేవయ్య, సతీష్, గోవింద్, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వంతో బీమా


వేణుగోపాలపురంలో సభ్యత్వ నమోదు చేయిస్తున్న రవి, నాయకులు

వెదురుకుప్పం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ సభ్యత్వంతో పార్టీ కార్యకర్త కుటుంబానికి బీమా ప్రయోజనాలు సమకూరుతాయని టీడీపీ యూనిట్ ఇన్‌చార్జి బీఎం రవి తెలిపారు. శనివారం తిరుమలయ్యపల్లె పంచాయతీ వేణుగోపాలపురంలో పార్టీ సభ్యత్వ నమోదు చేయించారు. బూత్ కమిటీ కన్వీనర్ సి.రాజగోపాల్, లోకనాథరెడ్డి పాల్గొన్నారు.

నాణ్యత లోపిస్తే బిల్లులు కట్‌చేస్తాం

గుడిపాల, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఉపాధి హామీ పథకం కింద వేసే సీసీ రోడ్లలో నాణ్యత లోపిస్తే బిల్లులు మంజూరు చేయబోమని పంచాయతీరాజ్ ఈఎన్‌సీ బాలునాయక్ స్పష్టం చేశారు. శనివారం మండలంలోని కొత్తపల్లి పంచాయతీ కిల్లారిపల్లిలో ఉపాధి కింద చేపడుతున్న సీసీ రోడ్లను తనిఖీ చేశారు. సచివాలయ పనితీరు మెరుగుపరుచుకోవాలని సూచిం చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ చంద్రశేఖర్‌రెడ్డి, డీఈ నవీన్, ఏఈఈ ప్రసాద్ నాయుడు, మాజీ జడ్పీటీసీ సుమతి మురళీనాయుడు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వీటినిలా వదిలేయడమేనా?

- ఎస్ఆర్‌పురం మండలంలో నిరుపయోగంగా సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్లు



ఎస్ఆర్‌పురంలో మూలనపడ్డ చెత్తను సేకరించే రిక్షాలు, తయ్యూరులో ప్లాంట్‌లోని తొట్టెలు


వీపీపురంలో నిరుపయోగంగా ఉన్న సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంటు

శ్రీరంగరాజపురం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు చెత్త నుంచి సంపద సృష్టించేందుకు ఏర్పాటు చేసిన సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్లు మండలంలో నిరుపయోగంగా మారాయి. వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఈ ప్లాంట్ల నిర్వహణను పట్టించుకోలేదు. చెత్తను సేకరించడానికి వాడే రిక్షాలు కూడా మూలనపడ్డాయి. వర్మి కంపోస్టు తయారీ కోసం ఏర్పాటైన తొట్టెలు కూడా శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఈ ప్లాంట్లను వినియోగంలోకి తేవాలని స్థానికులు కోరుతున్నారు.

ఈశ్వర్ కళ్యాణ్ ట్రస్టు ఆధ్వర్యంలో సిమెంటు రోడ్డు నిర్మాణం



బంగారుపాళ్యం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు- పలమనేరు రోడ్డు ఆండారెడ్డిపల్లె వద్ద ఐదేళ్లుగా రోడ్డుపై మురుగునీరు ప్రవహించి పెద్దపెద్ద గుంతలు ఏర్పడి ప్రమాదాలు జరిగేవి. ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. తగ్గువారిపల్లెకు చెందిన టీడీపీ నేతలు ఈ విషయాన్ని ఈశ్వర్ కళ్యాణ్ అభయం ట్రస్టు వారి దృష్టికి తీసుకెళ్లారు. వారు స్పందించి శనివారం రూ.3 లక్షలు ఖర్చుచేసి సిమెంటు రోడ్డు వేయించారు. ప్రయాణికులు, గ్రామస్తులు ట్రస్టు నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలియజేశారు. కళ్యాణ్, లోకనాథనాయుడు, హేమచంద్ర నాయుడు, జీఆర్ కనస్ట్రక్షన్ నిర్వాహకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వాలీబాల్ కోర్టుకు ఫ్లడ్‌లైట్ల వితరణ


ఫ్లడ్‌లైట్లను స్విచ్చాన్ చేసి ప్రారంభిస్తున్న ఎన్‌పీ జయప్రకాష్, కుమార్‌రాజ

బంగారుపాళ్యం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): బంగారుపాళ్యం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉన్న వాలీబాల్ క్రీడా మైదానానికి రూ. 1.50 లక్షల విలువ చేసే ఫ్లడ్ లైట్లను ఈశ్వర్ కళ్యాణ్ అభయం ట్రస్టు వారు వితరణ చేశారు. శనివారం మండల టీడీపీ అధ్యక్షుడు ఎన్‌పీ జయప్రకాష్, జడ్పీ మాజీ ఛైర్మన్ కుమార్‌రాజా చేతుల మీదుగా లైట్లను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ డీఎస్‌డీవో సుదర్శన్ నాయుడు, బాస్కెట్ బాల్ జిల్లా కార్యదర్శి సురేష్, జాతీయ వాలీబాల్ క్రీడాకారులు తులసీరెడ్డి, కుమార్, మురారి, పెరుమాళ్, గ్రామ వైస్ సర్పంచ్ కామరాజ్, జనార్ధన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పశువుల్లో వ్యాధి నిరోధక శక్తిని పెంచాలి


సమావేశంలో మాట్లాడుతున్న జేడీ ప్రభాకర్

చిత్తూరు సెంట్రల్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): పశువుల్లో వ్యాధి నిరోధక శక్తిని పెంచేలా చర్యలు చేపట్టాలని పశు సంవర్ధక శాఖ జేడీ ప్రభాకర్ సూచించారు. శనివారం స్థానిక బహువిధ పశువైద్యశాఖ ప్రాంగణంలో పశువులకు సోకే వ్యాధులు నియంత్రించడం, యాంటీ మైక్రోబియల్ నిరోధకతపై పశువైద్యాధికారులకు, సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాంటీ బయోటిక్ మందుల వినియోగం ద్వారా సూక్ష్మజీవులు ఆ మందులు పనిచేయకుండా నిరోధకతను పెంపొందించుకుంటున్నాయన్నారు. ఫలితంగా ప్రపంచ వ్యాప్తంగా ఏడాదికి 5 మిలియన్ల పశువులు మృత్యువాత పడుతున్నాయని, ఇదే కొనసాగితే 2050 నాటికి 10 మిలియన్ల పశువులు చనిపోయే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. పశువైద్యాధికారులు సరైన మందులు సిఫార్సు చేసి పశువుల్లో వ్యాధి నిరోధక శక్తిని పెంచేందుకు రైతులకు సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీడీ లక్ష్మి సుబ్బమ్మ, వీపీసీ సుధారాణి, యషిత, వీఏఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్వీసెట్‌లో ఎల్లుండి యువ ఉత్సవ్


పోస్టర్‌ను ఆవిష్కరణ కలెక్టర్, జేసీ

చిత్తూరు కలెక్టరేట్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఈనెల 26న స్థానిక ఎస్వీసెట్ ఇంజనీరింగ్ కళాశాలలో జిల్లాస్థాయి యువ ఉత్సవ్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను జేసీ విద్యాధరితో కలిసి ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా నెహ్రూ యువకేంద్రాల ద్వారా యూత్ ఫెస్టివల్స్ నిర్వహిస్తున్నారన్నారు. ఇందులో భాగంగా ఎస్వీసెట్‌లో యూత్ ఫెస్టివల్ జరుగుతుందని చెప్పారు. ఈ కార్య క్రమంలో చిత్రలేఖనం, వ్యాసరచన, వక్తృత్వ, కవిత్వం, ఫోటోగ్రఫీ, సైన్స్ మేళా, నాట్య పోటీలు జరుగుతాయన్నారు. 15 నుంచి 29 సంవత్సరాల్లోపు యువతీయువకులు తమకు నచ్చిన పోటీల్లో పాల్గొనవచ్చని కలెక్టర్ తెలిపారు. వివరాలకు ఎన్‌వైకే జిల్లా యువజన అధికారి ప్రదీప్ కుమార్ సెల్ నెంబరు 9908127829కు సంప్రదించాలని చెప్పారు.

యోగా, ధ్యానంతో విశ్రాంతి

- ఆపరేషన్ ఏఎస్పీ రాజశేఖర్‌రాజు


పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న ఆపరేషన్ ఏఎస్పీ రాజశేఖర్‌రాజు

చిత్తూరు అర్బన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): యోగా, ధ్యానం ద్వారానే శరీరానికి విశ్రాంతి, మనసుకు ప్రశాంతత లభిస్తుందని ఆపరేషన్ ఏఎస్పీ రాజశేఖర్ రాజు అన్నారు. శనివారం ఏఆర్ పరేడ్ మైదానంలో ఎస్టీఎఫ్, ఏఆర్, బీడీ టీమ్, డాగ్ స్క్వాడ్, హోంగార్డు సిబ్బందితో పరేడ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాయామం, శ్వాస సం బంధ వ్యాయామాలు చేయడం వల్ల అలసట లేకుండా శక్తివంతంగా పోలీసులు విధులు నిర్వహించేందుకు అవకాశం ఉందన్నారు. ఏఆర్ ఏఎస్పీ శివానంద కిశోర్ మాట్లాడుతూ గన్‌మెన్లుగా ఉన్న వారంతా క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలన్నారు. అంతకుముందు పోలీసుల నుంచి ఆయన గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ సుధాకర్, ఆర్ఎస్ఐలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపై పశువుల కట్టడికి ప్రత్యేక బృందం



నగరంలో తిరిగే ఆవులను పట్టుకుంటున్న సిబ్బంది

చిత్తూరు అర్బన్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): నగరంలోని రోడ్లపై విచ్చలవిడిగా తిరుగుతున్న పశువులను కట్టడి చేయడానికి నగరపాలక అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. పండ్లు, కూరగాయల మార్కెట్ల వద్ద బీభత్సం సృష్టించి ఇటు వ్యాపారులను... అటు ప్రజలను, వాహనదారులను ఇబ్బందులకు గురి చేస్తున్న ఆవుల సంచారాన్ని అడ్డుకునేందుకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. ఈ బృందంలో ముగ్గురు మేస్త్రీలు, ఒక సెక్రటరీ, పది మంది వర్కర్లు ఉంటారు. వీరు నగరంలో ఎక్కడ ఆవులు తిరిగినా వాటిని పట్టుకుంటున్నారు. మొదటి సారి పట్టుకున్న ఆవుకు సంబంధించిన యజమానికి నోటీసులు జారీ చేసి ఆవుపై మార్కింగ్ చేస్తారు. రెండో సారి తిరిగితే ఒక్కో ఆవుకు రూ. 500లు జరిమానా విధిస్తున్నారు. మూడో సారి తిరిగిన ఆవులను పట్టుకుని పలమనేరు వద్ద ఉన్న గోశాలకు తరలిస్తున్నారు. ఈవిధంగా ఈ వారంలో 32 ఆవులను పట్టుకున్నారు. వాటిలో 11 ఆవులకు రూ.5500 జరిమానాను విధించారు. ఈ సందర్భంగా ఎంహెచ్‌వో డాక్టర్ లోకేష్ మాట్లాడుతూ ఆవుల యజమాలు కూడా ప్రజలు, వ్యాపారుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఇంటి వద్దనే ఆవులను పెట్టుకోవాలని సూచించారు.

జోరుగా టీడీపీ సభ్యత్వ నమోదు

పాలసముద్రం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలో టీడీపీ సభ్యత్వ నమోదు జోరుగా సాగుతున్నట్లు టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బీమినేనిచిట్టిబాబునాయుడు పేర్కొన్నారు. శనివారం పాలసముద్రం పంచాయతీలోని దీనబంధుపురం, రాచపాళ్యం, మణిపురం, పాలసముద్రం గ్రామాలలో సభ్యత్వ నమోదు చేపట్టారు. టీడీపీ సభ్యత్వం తీసుకున్నవారికి రూ.5 లక్షలు బీమా వర్తిస్తుందన్నారు. సభ్యత్వం తీసుకున్న కార్యకర్త ఎవరైనా మరణిస్తే వారి అంత్యక్రియలకు రూ.10వేలు అందిస్తానని తెలియజేశారు. నాయకులు వాసునాయుడు, శేఖర్‌రాజు, రవి నాయుడు, వాసుయాదవ్, నవీన్ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



ప్రసంగిస్తున్న సీఐ మహేశ్వర్

నగరి, నవంబరు23(ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియా, సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని నగరి సీఐ మహేశ్వర్ పేర్కొన్నారు. నగరి డిగ్రీ కళాశాల విద్యార్థులకు శనివారం సోషల్ మీడియా వినియోగం, సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. కళాశాలలో కంప్యూటర్‌సైన్స్, కంప్యూటర్ అప్లికేషన్స్ విభాగాల వారు సంయుక్తంగా నిర్వహించిన ఈకార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వ్యక్తిగత వివరాలు సోషల్ మీడియాలో ఉంచరాదని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వేణుగోపాల్, ఇందిరాప్రియదర్శిని, అరుణకుమారి, పంకజం, రేవతి, ఉమామహేశ్వరి పాల్గొన్నారు.

రఘుపతికి కరణం పురస్కారం



చిత్తూరు కల్చరల్, నవంబరు23 (ఆంధ్రజ్యోతి) : 2024 -కరణం జ్ఞానేశ్వరి సాహితీ పురస్కారానికి వి.కోటకు చెందిన ప్రముఖ కవి, సామాజిక వేత్త వి. రఘుపతిని ఎంపిక చేసినట్లు నవ్యాంధ్ర రచయిత్రుల సంఘం జిల్లా అధ్యక్షురాలు కరణం విమల తెలిపారు. ఈ మేరకు శనివారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు.

ప్రభుత్వ విప్ థామస్‌కి సత్కారం



వెదురుకుప్పం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): గంగాధరనెల్లూరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ డాక్టర్ వీఎం థామస్‌ను శనివారం విజయవాడలోని జీఆర్‌టీ గ్రాండ్‌లో మంత్రి నాదెండ్ల మనోహర్ సన్మానించి సత్కరించారు. పెద్దకూరపాడు శాసనసభ్యులు భాష్యం ప్రవీణ్, ప్రభుత్వ చీఫ్ విప్ ఆంజనేయులు హాజరయ్యారు.

సారా ఊట ధ్వంసం

నగరి, నవంబరు23(ఆంధ్రజ్యోతి): నగరి మండల పరిధిలోని ఆడవికొత్తూరు, సత్రవాడ కొండ ప్రాంతాలలో శనివారం ఎన్‌ఫోర్స్ మెంటు, ఎక్సైజ్ శాఖ అధికారులు నిర్వహించిన దాడులలో 3200 లీటర్ల సారాఊటను ధ్వంసం చేసినట్లు సీఐ శ్రీనివాసరెడ్డి తెలిపారు.

టీడీపీ నాయకుడి మృతి


ఆర్థికసాయం అందజేస్తున్న ఢిల్లీబాబు

వెదురుకుప్పం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మండలం ఆర్కేవీబీపేటకు చెందిన టీడీపీ గ్రామ కమిటీ నాయకుడు సుబ్రహ్మణ్యం (55) అనారోగ్యంతో శనివారం మృతిచెందారు. పార్టీ శ్రేణులు ఆ గ్రామానికి చేరుకుని ఆయన మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారి కుటుంబసభ్యులను పరామర్శించారు. అనంతరం పార్టీ తరఫున మండల యువత ప్రధానకార్యదర్శి ఎస్.ఢిల్లీబాబు రూ.10వేలు ఆ కుటుంబానికి అందజేశారు. అంజలి ఘటించిన వారిలో టీడీపీ నాయకులు అన్నారెడ్డి హేమంత్ కుమార్‌రెడ్డి, అన్నారెడ్డి రమేష్‌రెడ్డి, సతీష్‌రెడ్డి ఉన్నారు.